మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి

## జిల్లాల జోలికొస్తే అగ్గిరాజేస్తాం...

- రేవంత్ రెడ్డి అహంకారి,అజ్ఞాని,అబద్ధాల కోరు
- బిఆర్ఎస్ పార్టీని పతనం చేయడం నీ తరం కాదు
- బిఆర్ఎస్ పార్టీతో పెట్టుకున్న మహామహులు మట్టికొట్టుకుపోయారు
- రేవంత్ రెడ్డిది ప్రజాపాలన కాదు విధ్వంస పాలన
- మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి, జనవరి 19 ప్రభాతవార్త :** కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో ప్రజలకు పాలన చేరువైందని, అలాంటి జిల్లాల జోలికొస్తే అగ్గి రాజేస్తామని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. సోమవారం జిల్లా కేంద్రంలోని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి నివాసంలో బిఆర్ఎస్ ముఖ్య నాయకులతో కలసి పత్రికా సమావేశం ఏర్పాటు చేసి ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డిపై నిప్పులు చెరిగారు. బిఆర్ఎస్ పార్టీ దిమ్మెలు కూల్చండి అని పిలుపునివ్వడం సంఘవిద్రోహ శక్తులు చేసే పని అని అలాంటి వ్యాఖ్యలు చేసిన వారిపై వెంటనే కేసు నమోదు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రికి చట్టం తెలియకపోవచ్చు. ఆయన ఇష్టం ఉన్నట్లు మాట్లాడడం సరికాదన్నారు. ప్రతిపక్ష పార్టీ గద్దెలు కూల్చండి అనడం విద్వేషాలు రెచ్చగొట్టడమేనన్నారు. సీఎం రేవంత్ అహంకారపు మాటలు.సీఎం పదవికి కళంకం తెచ్చే విధంగా ఉన్నాయని,హామీల అమలు చేయమంటే ఓడగొట్టిన,నడుము ఇరగ్గొట్టిన అని మాట్లాడుతున్నాడు.దేశంలో అనేక రాష్ట్రాల్లో కాంగ్రెస్ అడ్రస్ లేదు.. రెండు మూడు సార్లు వరుసగా ఓడిపోయింది. సీఎం రేవంత్‌కి మానసిక వైకల్యం వచ్చిందేమో అని అనుమానం ఉంది. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరిన అని చెప్పారు.పది మంది కాంగ్రెస్‌లో చేరారనేది లోకమంతా తెలిసిన విషయమే..వారిని రాజీనామా చేయించి పోటీ చేయించండి. మేము కట్టిన వాటికి రిబ్బన్‌లు కట్ చేస్తున్నారనిపదిహేను సంవత్సరాలలో కాంగ్రెస్ రెండోసారి గెలిచిన దాఖలాలు లేవు అని అన్నారు.రెండు జాతీయ పార్టీలను తట్టుకొని రెండుసార్లు గెలిచి,మూడోసారి 1.8 ఓట్ల తేడాతో ఓడిపోయినం.బీహార్‌లో కాంగ్రెస్ ఆరు సీట్లు మీకు సిగ్గుచేటు..ముప్పై ఏండ్లలో కాంగ్రెస్, టీడీపీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకం కోసం పెట్టిన 2700 కోట్లు మాత్రమే..రెండున్నర ఏండ్ల కాలంలో మూడున్నర వేల కోట్లు ఖర్చు పెట్టి నీళ్ళు ఇచ్చినాం అని గుర్తు చేశారు.32000 కోట్ల విలువైన పనులు పాలమూరు రంగారెడ్డి పూర్తి చేసినం. 27000 కోట్లు బిల్లులు ఇచ్చినం...కాంగ్రెస్ ఐదువేల కోట్ల రూపాయల – మిగతా4లో..

## ప్రజావాణి ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలి



ప్రజావాణిలో ఫిర్యాదులను స్వీకరిస్తున్న కలెక్టర్

**గద్వాల జనవరి 19, ప్రభాతవార్త:** ప్రజావాణి ఫిర్యాదు సమస్యల సత్వర పరిష్కారం కోసం సంబంధిత అధికారులు కృషి చేయాలని కలెక్టర్ బి. యం. సంతోష్ అన్నారు. ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్నిశాఖలకు చెందిన జిల్లా అధికారులు అందరు విధిగా హాజరు కావాలని కలెక్టర్ అన్నారు. సోమవారం ఐ.డీ.ఓ.సీ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావులతో కలిసి కలెక్టర్ బి.యం.సంతోష్ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు.54వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ప్రజావాణి కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తించి జిల్లా అధికారులు తప్పనిసరిగ అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# చదువుతోనే సమాజంలో మార్పు

- విద్య వైద్యానికే మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత...
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ్మ



మహిళాకు వడ్డీ లేని రుణాల చెక్కును అందజేస్తున్న మంత్రి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త:** చదువే సమాజంలో మార్పుకు నాంది పలుకుతుందని, అందుకే రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, విద్య ద్వారా ప్రజల్లో అవగాహన పెరిగి, సామాజిక ఆర్థిక అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ సందర్భంగా తెలిపారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలలో సోమవారం రాష్ట్రవైద్య ఆరోగ్య శాఖ, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్సీ కూచుకుళ్ళ దామోదర్ రెడ్డి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, ఇతర ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసితో వివిధ అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపన పనులను, ఎండబెట్ల వద్ద హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి 10 కోట్లతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన, రూ.2 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన, 1 కోటి ఐదు లక్షల 50 వేల రూపాయలతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తరగతి గదులను ప్రారంభించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవనాలకు 9 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న నూతన కళాశాల భవనానికి శంకుస్థాపన, నాగర్ కర్నూల్ మున్సిపాలిటీ పరిధిలో 10, కోట్ల రూపాయలతో సి.సి రోడ్లు పనులకు శంకుస్థాపన, పట్టణంలో డ్రైనేజ్ వ్యవస్థకు 10, కోట్ల రూపాయలతో శంకుస్థాపన, 3 కోట్ల, 14 లక్షల 60 వేల రూపాయల, వ్యయంతో పట్టణ పరిధిలోని కేసరి సముద్రం మినీ ట్యాంక్ బండ్ అధునాతన అభివృద్ధికి పనులకు శంకుస్థాపన పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ పాఠశాలల మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఉపాధ్యాయుల నియామకం, ఆధునిక సాంకేతికతను విద్యలో వినియోగించడం వంటి చర్యల ద్వారా విద్య ప్రమాణాలను మెరుగుపరుస్తున్నామని మంత్రి వెల్లడించారు. విద్యా రంగం ద్వారా భవిష్యత్తు తరాలకు బలమైన పునాది వేయగలమని, అదే రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రతి పేదవాడి ఆరోగ్యాన్ని కాపాడటమే ముఖ్య ఉద్దేశంగా పనిచేస్తోందని, అందుకు అనుగుణంగానే రాష్ట్రంలో విద్యా, వైద్య రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యా రంగంలో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన బోధనపై దృష్టి సారించడంతో పాటు, వైద్య రంగంలో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పేర్కొన్నారు. విద్య, వైద్య రంగాల బలోపేతమే రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. విద్య ద్వారా భవిష్యత్ తరాలకు బలమైన పునాది వేయడంతో పాటు, విద్యా సంస్థల అభివృద్ధి, నాణ్యమైన బోధన, అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాల విస్తరణ ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశగా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, వైద్య రంగాన్ని బలోపేతం చేసి ప్రతి పేదవాడికి మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యం ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమని తెలిపారు. రాష్ట్రంలో 109 ట్రామా కేంద్రాల నిర్మాణం చేశామని, వృద్ధ తల్లిదండ్రుల కోసం 37, ప్రణామ్ కేంద్రాలు స్థాపించామన్నారు. రాష్ట్రంలో 200కోట్లతో 105 ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామన్నారు. న్యూట్రిషన్ ఆహారం, స్కిల్ ఎడ్యుకేషన్ విధానం కావాలన్నారు.ప్రభుత్వ ఆసుపత్రుల్లో మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక వైద్య పరికరాల ఏర్పాటు, వైద్య సిబ్బంది నియామకం ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి తీసుకు వస్తామని, చేపట్టిన అభివృద్ధి పనులు నిర్ణీత గడువులో పూర్తి చేసేలా అధికారులకు ఆదేశాలు జారీచేశామని పేర్కొన్నారు.అభివృద్ధి ఫలాలు ప్రతి కుటుంబానికి చేరాలన్నదే ప్రభుత్వ ధ్యేయమని ఆయన పేర్కొన్నారు.

**విద్యార్థులతో మంత్రి ముఖాముఖి...**

అంతకుముందు పలువురు విద్యార్థులతో మంత్రి దామోదర్ రాజనర్సింహ ముఖాముఖిగా మాట్లాడారు. జీవితంలో ఏమి సాధించాలనుకుంటున్నారు. ఎలాంటి లక్ష్యాలతో ముందుకు సాగుతున్నారన్న అంశాలపై విద్యార్థులను ప్రశ్నిస్తూ వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ లక్ష్యాలను వివరించారు. ఐఏఎస్, డాక్టర్లు, ఇంజనీరింగ్ రంగం, ఆర్మీ, నేవీ వంటి ఉన్నత స్థానాల్లో రాణించేందుకు పోటీపడుతున్నామని తెలిపారు. విద్యార్థుల లక్ష్యాలను సాధించుకునే విధంగా ఎలా సిద్ధం కావాలన్న అంశాలపై మంత్రి పలు సలహాలు, సూచనలు అందజేశారు. క్రమశిక్షణ, నిరంతర శ్రమ, సరైన ప్రణాళికతో ముందుకు సాగితే విజయం సాధ్యమని పేర్కొంటూ విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వాన్ని అందించారు.

అనంతరం ఎంపీ డాక్టర్ మల్లురవి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో కొనసాగుతున్న – మిగతా4లో..



సమావేశానికి హాజరైన విద్యార్థినులు

# గ్రామాల అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకం

**గద్వాల జనవరి 19, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర కీలకమని,ఈ శిక్షణను సద్వినియోగం చేసుకుని గ్రామాభివృద్ధి కోసం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ సూచించారు. సోమవారం ఎర్రవల్లిలోని 10వ పోలీస్ బెటాలియన్‌లో కొత్తగా ఎన్నికైన గ్రామ పంచాయతీ సర్పంచ్‌లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ పరిపాలన, అభివృద్ధిపై శిక్షణలో భగంగా గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి,అలంపూర్ శాసనసభ్యులు విజయుడు పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంతోష్ మాట్లాడుతూ, సర్పంచ్ పదవి అత్యంత ముఖ్యమైనదని, ప్రతి సర్పంచ్ అధికారులుతో సమన్వయం చేసుకుని గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ఈ రోజు నుంచి ఐదు రోజుల శిక్షణ కార్యక్రమంలో సర్పంచ్‌లు పంచాయతీ చట్టం 2018 ప్రకారం అన్ని నియమాలు, నిబంధనలను,విధులు,బడ్జెట్,15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు,ప్రభుత్వ పథకాల వినియోగం,అధికారులు సంప్రదింపు విధానం వంటి అంశాలను పూర్తిగా తెలుసుకోవాలని సూచించారు. గ్రామాల అభివృద్ధిలో విద్య, ఆరోగ్యం అత్యంత ముఖ్యమని తెలిపారు. జిల్లాలో అక్షరాస్యత శాతం పెరిగేలా కృషి చేయాలని సూచించారు.గత 10వ తరగతి పరీక్షల్లో 10 శాతం మెరుగుదల సాధించామని,డీఎంఎఫ్టీ నిధుల ద్వారా విద్యా వాలంటీర్లను నియమించామని తెలిపారు. సర్పంచ్‌ల సహకారంతో విద్యా రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షించి,ఆరోగ్యం,పోషకాహారం,ప్రాథమిక విద్యకు బలమైన పునాదిగా మార్చాలని సూచించారు.నీతి ఆయోగ్‌లో గట్టు మండలం వెనుకబడిన ప్రాంతంగా ఎంచుకున్నప్పటికీ, చిత్తశుద్ధితో పనిచేసి ఐదో స్థానాన్ని సాధించి,ఒక కోటి రూపాయల ప్రైజ్ మనీ సాధించడం జరిగిందన్నారు. గ్రామంలో మార్పు ఒక రోజులో రాదు కాబట్టి,అభివృద్ధికి నిరంతర కృషి మరియు స్థిరమైన పని అవసరమని తెలిపారు.గ్రామాల్లో గుడిసె ఇల్లు లేకుండా ప్రతి కుటుంబానికి పక్కా ఇల్లు కల్పించేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసి, ఒక్కో ఇంటికి రూ.5 లక్షల వరకు నిధులు ఇస్తున్నామని తెలిపారు. ఈ విధమైన రాష్ట్ర,కేంద్రప్రభుత్వ పథకాలు అర్హులైన గ్రామ ప్రజలకు పూర్తిగా చేరేలా సర్పంచ్‌లు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. గ్రామాల్లో స్వచ్ఛ భారత్ కార్యక్రమం ద్వారా పరిశుభ్రతపై ప్రజలను ప్రోత్సహిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించడం సర్పంచ్‌ల బాధ్యత అని తెలిపారు.గ్రామస్థాయిలో జనన సర్టిఫికెట్లు,తాగునీటి సరఫరా,మౌలిక వసతుల పనులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ ఐదు రోజుల శిక్షణను పూర్తిగా సద్వినియోగం చేసుకొని గ్రామాల సమగ్ర అభివృద్ధికి ప్రతి సర్పంచ్ కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

**సర్పంచులు చిత్తశుద్ధితో పనిచేయాలి... ఎమ్మెల్యే బండ్ల**

గద్వాల్ శాసన సభ్యులు బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధి కోసం సర్పంచ్‌లు చిత్తశుద్ధితో పనిచేయాలని అన్నారు. గతంలో గ్రామాల్లో డంప్ యార్డులు, ట్రాక్టర్లు,వాటర్ ట్యాంకర్లు, చెట్లు నాటడం, క్రీడా మైదానాలు,శ్మశాన వాటికలు వంటి అనేక అభివృద్ధి పనులు విజయవంతంగా చేపట్టామని తెలిపారు.రాబోయే ఐదేళ్లలో విద్య, వైద్యం, మహిళల సాధికారత,రైతుల సంక్షేమం, ఉపాధి అవకాశాల కల్పన, పర్యావరణ పరిరక్షణతో పాటు విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా గ్రామాలను మరింత అభివృద్ధి చేయాలని అన్నారు. సమయాన్ని వృథా చేయకుండా వచ్చే ఐదేళ్ల కాలంలో ప్రణాళికలు రూపొందించుకొని పంచాయతీ సెక్రటరీల సమన్వయంతో అభివృద్ధి పనులు చేపట్టాలని సూచించారు.ఎన్ఆర్ఈజీఎస్,15వ ఫైనాన్స్ కమిషన్ నిధులు తదితర పథకాల ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయాలని సూచించారు.రాష్ట్రపతి తర్వాత చెక్ పవర్ ఉన్నది సర్పంచ్‌లకేనని పేర్కొంటూ గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని అన్నారు. బేధాభిప్రాయాలు లేకుండా సర్పంచ్‌లు,వార్డు సభ్యులు అందరూ కలిసి పనిచేయాలని తెలిపారు.చేను బాటల అభివృద్ధి కోసం ఇప్పటికే కొన్ని గ్రామాలకు నిధులు మంజూరు చేశామని, మిగిలిన గ్రామాలకు కూడా త్వరలో నిధులు విడుదల చేస్తామని తెలిపారు.గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం తమ వంతు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.గ్రామాల

**అభివృద్ధిలో ఐక్యత చాటాలి... ఎమ్మెల్యే విజయుడు**

అలంపూర్ శాసనసభ్యులు విజయుడు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర చాలా ముఖ్యమని అన్నారు. సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు ఐక్యతతో పనిచేస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని తెలిపారు. గ్రామాభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు,గద్వాల్ మార్కెట్ యార్డు చైర్మన్ నల్ల హనుమంతు, డిప్యూటీ జెడ్పీ సీఈఓ నాగేంద్రం, డిపిఓ శ్రీకాంత్,బెటాలియన్ కమాండెంట్ జయరాజు, సర్పంచులు,ఎంపిడిఓలు, తదితరులు పాల్గొన్నారు.

## గణతంత్ర వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- 21 లోగా ఉత్తమ ఉద్యోగుల జాబితా తయారు చేయాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి
- గణతంత్ర వేడుకల ఏర్పాట్లపై సమీక్ష



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్రబోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 19 ప్రభాతవార్త:** జనవరి 26 గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లుచేయాలని జిల్లాకలెక్టర్ విజయేందిర బోయి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో అన్ని శాఖల అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై కలెక్టర్ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా ఆదేశాలు జారీ చేశారు. గణతంత్ర – మిగతా4లో..



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## ప్రజల అంచనాలకు అనుగుణంగా గ్రామ పరిపాలన అందించాలి

సర్పంచుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్

**నారాయణపేట, జనవరి19 ప్రభాతవార్త :** నారాయణపేటజిల్లాలో కొత్తగా ఎన్నికైన సర్పంచులు ఏర్పాటుచేసిన ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని,ప్రజల అంచనాలకు అనుగుణంగా తమ గ్రామాల్లో మెరుగైన పరిపాలన అందించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ఆదేశాల మేరకు గ్రామీణాభివృద్ధి సంస్థ సహకారంతో జిల్లాకేంద్రానికి సమీపంలోని సింగారం మలుపుదారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచుల మొదటి బ్యాచ్ ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది.ఈకార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,గతేడాది డిసెంబర్ 17వరకు జిల్లాలో మూడు విడతలుగా సర్పంచుల ఎన్నికలను విజయవంతంగా పూర్తిచేశామని తెలిపారు.అదే నెల 24న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి – మిగతా4లో..

# ప్రజా ప్రభుత్వంలో మహిళలకు వడ్డీ లేని రుణాలు

- మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం
- రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న
- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి
- వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి
- రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి



ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి వాకిటి శ్రీహరి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 19 ప్రభాతవార్త :** మహిళా సంక్షేమంతో పాటు, రాష్ట్రవ్యాప్తంగా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం వనపర్తి పట్టణంలోని స్థానిక దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాల్ నందు మహిళలకు వడ్డీ లేని రుణాలతో పాటు, ఇందిరమ్మ చీరల పంపిణీ చేసేందుకు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి అధ్యక్షతన ఇందిర మహిళా శక్తి సంబరాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతోపాటు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణంలో మహిళలకు ఇందిరా మహిళా శక్తి లో భాగంగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. అదేవిధంగా 2023,24, 2024,25 కి సంబంధించి 529 సంఘాలకు గానూ రూ. 1.60 కోట్ల వడ్డీ లేని రుణాలను మంజూరు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో రెండేళ్ల కిందట కొలువుదీరిన ప్రజా ప్రభుత్వం మహిళా సంక్షేమానికి మొదటి ప్రాధాన్యం ఇస్తోందని అన్నారు. ప్రజా ప్రభుత్వం కొలువుదీరిన డిసెంబర్ 9న మొదటి సంతకం మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం ఫైల్ మీద చేయడం జరిగిందన్నారు. ఇప్పుడు ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా మహిళలకు సారె పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందుల్లో ఉన్నా ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని చెప్పారు.ఇందిరా మహిళాశక్తి పథకంలో భాగంగా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేస్తున్న చీరలు వారి ఆత్మ గౌరవానికి ప్రతీకగా నిలుస్తున్నాయని చెప్పారు. మహిళా సంఘం సభ్యులకు ప్రతి ఒక్కరికి ఈ చీరలు చేరుతాయని తెలిపారు.స్వయం సహాయక బృందాల ద్వారా రుణాలు తీసుకున్న సభ్యులు ఎవరైనా ప్రమాదవశాత్తు మరణిస్తే తీసుకున్న రుణాన్ని మాఫీ చేసే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. అంతేకాకుండా మరణించిన సభ్యురాలు కుటుంబానికి రూ. 5 లక్షల – మిగతా4లో..

## బిజెపి,కాంగ్రెస్ కలిసి పుర ఎన్నికల్లోకి...

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్
- పుర ముఖ్య నాయకులతో సమావేశం

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 19 ప్రభాతవార్త :** పుర ఎన్నికల్లో బీజేపీ,కాంగ్రెస్ కలిసి పని చేస్తున్నాయని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ పిలుపు నిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మహబూబ్‌నగర్ పట్టణంలో డివిజన్‌ల వారీగా ముఖ్య – మిగతా4లో..



మాట్లాడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్

## ఈవిఎంలు భద్రపరిచిన

## స్ట్రాంగ్ రూమ్ దగ్గర పటిష్టమైన భద్రత పెట్టాలి

**గద్వాల, జనవరి 19, (ప్రభాతవార్త):** ఈవిఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద భద్రత పటిష్టంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అన్నారు. జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో గల గోదాము లో ఎలక్ట్రిక్ ఓటింగ్ మిషన్లు (ఈవీఎం) లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ ను జిల్లా కలెక్టర్ బి. ఎం.సంతోష్ సోమవారం సంబంధిత అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి తనిఖీ చేశారు.ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలకు ఒకసారి నిర్వహించే సాధారణ తనిఖీలో భాగంగా కలెక్టర్ తనిఖీ నిర్వహించారు. గద్వాల జిల్లాకు సంబంధించిన ఈవీఎంలు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ తో పాటు భద్రత నిర్వహణను పరిశీలించారు.ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్ నిర్వహణకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు.స్ట్రాంగ్ రూమ్ భద్రతలో భాగంగా ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనితీరును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ కరుణాకర్, సురేష్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



ఈ వి ఎం లు భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ దగ్గర కలెక్టర్ సంతోష్, తదితర అధికారులు

## విద్య ద్వారానే పేదరిక నిర్మూలన

**ఏఐఎంఐఎం నేతల వెల్లడి**

**ఆత్మకూర్ జనవరి 19, ప్రభాతవార్త:** సమాజంలో విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని ఆల్ ఇండియా ఇత్తెహాదుల్ ముస్లిం మీన్ ఆత్మకూరు పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అమ్ము జావిద్ మరియు నిరంజన్ తదితరులు వెల్లడించారు. సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు ఏఐఎంఐఎం ఆధ్వర్యంలో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా ఉచిత మోడల్ పేపర్స్ మరియు పరీక్షలకు సంబంధించిన మెటీరియల్స్ ను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా పేదలకు విద్య దూరం కాకూడదనే ఉద్దేశంతో ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విద్యార్థిని విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలతో పాటుగా వార్షిక పరీక్షలకు సంబంధించిన మెటీరియల్స్ ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. ఈ విషయాన్ని సద్వినియోగం చేసుకొని విద్యార్థిని విద్యార్థులు వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి విద్యలో రాణించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉర్దూ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నజీర్ ఏఐఎంఐఎం నాయకులు రఫీక్, ఇమ్రాన్, అక్బర్, ఖాదర్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉర్దూ మీడియం పాఠశాలలో విద్యార్థులకు ఉచిత మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

## ఉచిత ఫౌండేషన్ కోర్సుకై దరఖాస్తుల ఆహ్వానం

**గద్వాల జనవరి 19, ప్రభాతవార్త:** మహబూబ్‌గర్ ఎస్సీ స్టడీ సర్కిల్ లో స్టేట్ సర్వీసెస్, బ్యాంకింగ్, ఎస్ఎస్ సి, ఆర్ ఆర్ బి ఉద్యోగాలలో ప్రతిభ చాటేందుకు ఇచ్చే ఐదు నెలల ఉచిత ఫౌండేషన్ కోర్సు శిక్షణ కు అర్హులైన నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అదనపు కలెక్టర్ లక్ష్మీ మ్మనారాయణ తెలిపారు. శిక్షణకు సంబంధించిన గోడపత్రికలను సోమవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో అధికారులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణకు జోగుళాంబ గద్వాల జిల్లా లోని ఎస్సీ, ఎస్టీ, బీసి, మైనారిటీ గ్రాడ్యుయేట్స్ అభ్యర్థులు ఈ నెల 30వ తేదీలోగా వెబ్సైట్ నందు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఫిబ్రవరి ఎనిమిదవ తేదీన మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం లో పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షలో ప్రతిభ చాటి ఎంపికైన వారికి 5 నెలల పాటు ఉచిత హాస్టల్ వసతి, భోజన వసతి, స్టడీ మెటీరియల్ తో పాటు ఉచిత శిక్షణ ఉంటుందని తెలిపారు. వివరాలకు 8977340006 నంబర్ లో సంప్రదించగలరని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నుషిత, పలువురు జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వేమన అందరివాడు

**ప్రభుత్వపరంగా వేమన జయంతి నిర్వహించాలి.. పాలమూరు రెడ్డి సేవా సమితి డిమాండ్**

**మహబూబ్‌నగర్, జనవరి 19 ప్రభాతవార్త :** యోగివేమన ఆనాదయ సమాజంలో ఉన్న రుగ్మతల పై వివరించి ప్రజలకు అవగాహన కల్పించారని వేమన అందరి వాడని పాలమూరు రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు తూము ఇంద్రసేనారెడ్డి అన్నారు. పాలమూరు రెడ్డి సేవ సమితి ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి వేడుకలు సోమవారం రాజాబహద్దూర్ రెడ్డి కన్వెన్షన్ సెంటర్ లో ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు తూము ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సలహాదారు మద్ది అనంత రెడ్డి మాట్లాడుతూ వేమన అందరివాడని, ఆనాడే సమాజంలోని రుగ్మతలపై వేలాదిగా చక్కటి పద్యాలతో సామాన్యులకు అర్థమయ్యేలా రచనలు చేసారని తెలిపారు. నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ వేమన గురించి తెలుసుకోవాలని, ప్రభుత్వం కూడా వేమన జయంతిని ప్రభుప్వరంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి వేపూరు రాజేందర్ రెడ్డి, కోశాధికారి మల్లు నర్సింహారెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్రామిరెడ్డి, ప్రచార కార్యదర్శి సురేందర్ రెడ్డి, కార్యదర్శి కోటేశ్వర్ రెడ్డి, సభ్యులు పరమేశ్వర్ రెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లు సరస్వతీ, వరలక్ష్మి మ్మ పాల్గొన్నారు.
19ఎంబిఎస్ఆర్ 1: వేమన జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం

## అర్రైవ్ అలైవ్ పై పోలీసుల చైతన్య కార్యక్రమం

**ధన్వాడ, జనవరి 19 ప్రభాతవార్త :** నారాయణపేట జిల్లా ఎస్పీ డా. వినీత్, ఐపీఎస్ ఆదేశాల మేరకు మండల కేంద్రమైన ధన్వాడ లో ధన్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో అర్రైవ్ అలైవ్ అవగాహన కార్యక్రమాన్ని ఎస్సై రాజశేఖర్ నిర్వహించారు. ఆటో డ్రైవర్లు, బైక్ వాహనదార్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేశారు.ఎస్సై రాజశేఖర్ మాట్లాడుతూ ప్రాణం అనేది అత్యంత విలువైనది. చిన్న నిరక్ష్యంల్లో కూడా పెద్ద ప్రమాదా నికి కారణమవుతుంది. ప్రతి ప్రయాణంలో భద్రతే ప్రాధానం కావాలి" అని హెచ్చరించారు. హెల్మెట్ తప్ప నిసరి, అదుపు తప్పిన వేగం ప్రాణాంతకం, అంబులెన్స్ కు మార్గం ఇవ్వడం ప్రతి పౌరుడి బాధ్యత, మద్యం సేవించి డ్రైవింగ్ చేయొద్దు వంటి అంశాలను డ్రైవర్లకు వివరిస్తూ ప్రత్యక్ష ఉదాహరణలు చూపించారు. సదస్సులో పాల్గొన్న డ్రైవర్లు ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రయోజనకరంగా భావిస్తూ పోలీసుల ప్రయత్నాన్ని అభినందించారు. భవిష్యత్తులో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు తరచుగా నిర్వహించాలని కోరారు. స్థానిక ప్రజలు కూడా ఈ కార్యక్రమాన్ని ప్రశంసిస్తూ రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ఇది ఎంతో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. ధన్వాడ పోలీసులు ప్రజల భద్రత కోసం చేపడుతున్న చర్యలు స్థానికంగా ప్రశంసలు అందుకుంటున్నాయి.



చైతన్య కార్యక్రమం నిర్వహిస్తున్న పోలీస్ అధికారులు

## మండల విద్యాధికారిగా మినహాజుద్దిన్

**కోయిలకొండ జనవరి 19, ప్రభాతవార్త:** కోయిలకొండ మండల విద్యాధికారి (ఎం ఈ ఓ గా) మినహా జుద్దిన్ సోమవారం పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈయన మండలంలోని సూరారం జెడ్ పి హెచ్ ఎస్ జిహెచ్ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారులు ఈయనను మండల ఎం ఈ ఓ గా నియమించారు. ఈ సందర్భంగా పదవి బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంఈ ఓ మినహా జుద్దిన్ మాట్లాడుతూ మండలంలో విద్యావ్యవస్థ బలోపేతానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. ఉపాధ్యాయులందరి సహకారంతో విద్యారంగం లో ఉన్నత ఫలితాలను సాధించి జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలబెడతానన్నారు. నూతన ఎంఈఓ గా పదవి బాధ్యతలు స్వీకరించిన మినహా జుద్దిన్ కు మండల ఉపాధ్యాయ సంఘాలు పూల మాలలతో, శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పి ఆర్ టి యు అసోసియేటెడ్ అధ్యక్షుడు గోపాల్, మండల పిఆర్ టి యు అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, మండల పి ఆర్ టి యు సంఘం ఉపాధ్యాయ నేతలు, మండల ఎంఆర్సి కోఆర్డినేటర్ శంకర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నూతన బాధ్యతలు స్వీకరించిన ఎంఈఓ

# జిల్లెల మాధవరెడ్డి జీవితం నేటి సమాజానికి స్ఫూర్తి దాయకం

**రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**

**పుట్టిన భూమికి ఏదో ఒక సేవ**

**చేయాలి అనే తపన కలిగిన వ్యక్తి జిల్లెల మాధవరెడ్డి**

**రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నారెడ్డి**

**డా. మాధవరెడ్డి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని సేవలు అందిస్తా**

**స్థానిక శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి**

**నిస్వార్థ ప్రజా సేవకుడు మాధవ రెడ్డి**

**పేరున గొప్ప టోర్నమెంట్ లు నిర్వహిస్తాం**

**రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ కొత్తకాపు శివసేన రెడ్డి**

**డా. మాధవ రెడ్డి పేరున ఫుట్‌బాల్**

**టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయం**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

**వనపర్తి, జనవరి 19 ప్రభాతవార్త :** న్యూరాలజిస్టుగా ఉండి సంపాదించుకోవడానికి ఎన్నో అవకాశాలు ఉన్నా ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ నిరాడంబర జీవితం గడిపిన జిల్లెల మాధవ రెడ్డి జీవితం నేటి సమాజానికి స్ఫూర్తి దాయకమని రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. జనవరి 17న స్వర్గీయ జిల్లెల మాధవ రెడ్డి జన్మదినం, జనవరి 19న వర్ధంతిని పురస్కరించుకొని జనవరి 19 నుండి 21 వరకు (3) రోజులు స్వర్గీయ జిల్లెల మాధవ రెడ్డి స్మారక ఫుట్ బాల్ టోర్నమెంట్ ను సోమవారం స్థానిక పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో నిర్వహించగా ఇట్టి కార్యక్రమానికి రాష్ట్ర పశు సంవర్ధక, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి చిన్నారెడ్డి, స్థానిక శాసనసభ్యులు తుడి మేఘా రెడ్డి, రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతిని వెలిగించి క్రీడలు ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ నేటి సమాజంలో రాత్రికి రాత్రే సంపాదించుకొని గొప్ప వారిగా చలామణి అవుదామని అనుకుంటారు. కానీ జిల్లెల చిన్నా రెడ్డి ఒక న్యూరాలజిస్టు గా ఉండి సంపాదించుకునే అవకాశాలు ఉన్న వాటిని కాదని వనపర్తి జిల్లా ప్రజలకు ఉచిత వైద్యం అందించి జిల్లా ప్రజల హృదయాల్లో నిలిచిపోయారని కొనియాడారు. మాధవ రెడ్డి జీవన విధానాన్ని, వారి నిరాడంబర జీవితాన్ని ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని అన్నారు.రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల చిన్నా రెడ్డి మాట్లాడుతూ వనపర్తి జిల్లా జయన్న తిర్మలాపూర్ లో పుట్టిన తన పెద్దన్న మాధవ రెడ్డి వనపర్తి లోనే 11వ తరగతి వరకు విద్యాభ్యాసాలు పూర్తి చేసి మిగతా చదువులు హైద్రాబాద్ లో చదివి వైద్య విద్య పూర్తి చేసుకున్న అతను గొప్ప ప్రజా సేవకుడని కొనియాడారు. న్యూరాలజిస్ట్ అయినా డాక్టర్ మాధవరెడ్డి వారంలో 5 రోజులు నిమ్స్ ఆసుపత్రిలో వైద్య సేవలు అందిస్తూ శనివారం ఆర్టీసీ బస్సులో వనపర్తి వచ్చి సత్య సాయిబాబ గుడిలో అప్పటికే జమ అయి ఉన్న రోగులకు ఉచిత వైద్యం అందించి తిరిగి ఆదివారం సైతం వైద్యం అందించి సాయంత్రం ఆర్టీసీ బస్సులో హైదరాబాద్ వెళ్లేవారని గుర్తు చేశారు. మాధవ రెడ్డి జీవితాన్ని వారి సేవలను చిన్నా రెడ్డి గుర్తు చేశారు. స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ జీవితం అంటే మాధవ రెడ్డి మాదిరి ఉండాలని, వారి జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని వారి నిస్వార్థంగా ప్రజా సేవ చేసేందుకు నేడు నిశ్చయించుకున్నట్లు ప్రకటించారు. ఎన్ని రోజులు బతికామని కాకుండా ఎలా బతుకామన్నదే ముఖ్యమని, ప్రజలు గొప్పగా చెప్పుకునే విధంగా బతకాలన్నారు. మాధవరెడ్డి తన జిల్లా వాసిగా ఉన్నందుకు గర్వపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కొత్తకాపు శివసేనారెడ్డి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో గొప్ప దార్శనికుడు అయిన జి. మాధవరెడ్డి పేరున గొప్ప టోర్నమెంట్లు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ మాధవ రెడ్డి పేరున ఫుట్ బాల్ టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. క్రీడాకారులు మంచి క్రీడ స్ఫూర్తితో ఆటలు ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కళాకారులు రాజారాం ప్రకాష్, రామ్‌రెడ్డి తమ పాటల ద్వారా మాధవరెడ్డి జీవితాన్ని గుర్తు చేశారు. ఈ టోర్నమెంట్ మూడు రోజుల పాటు తెలంగాణ, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక నుండి 12 జట్లు ఫుట్‌బాల్ ఆడనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణకుమార్ రెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ పి. శ్రీనివాస్ గౌడ్, గ్రంథాలయ చైర్మన్ గోవర్ధన్ సాగర్, యువజన క్రీడల అధికారి సుధీర్ రెడ్డి, పిడి సురేందర్ రెడ్డి క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లెల మాధవ రెడ్డికి నివాళులర్పిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి



మాట్లాడుతున్న జి.చిన్నారెడ్డి



ఫుట్‌బాల్ క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి

## గణతంత్ర దినోత్సవ వేడుకలకు విస్తృత ఏర్పాట్లు : కలెక్టర్

**గద్వాల జనవరి 19, ప్రభాతవార్త:** గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లుచేయాలని జిల్లాకలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం అన్ని శాఖల అధికారుల తో సమీక్షా సమావేశం నిర్వహించారు. గద్వాల పోలీస్ పరేడ్ మైదానంలో జరిగే రిపబ్లిక్ డే వేడుక సందర్భంగా చేపట్టాల్సి న కార్యక్రమాల గురించి ఆయా శాఖల వారీగా అధికారులకు సూచనలను ఇచ్చారు. ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అట్టహాసంగా వేడుకలు జరిగేలా ఆయా శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వివిధ వర్గాల వారికోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. ఉత్తమ ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించేందుకు గాను శాఖల వారీగా పరిమితితో కూడిన ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. సమర్ధవంతంగా విధులు నిర్వహించిన సిబ్బందికి ప్రాధాన్యతనిస్తూ పేర్లను ప్రతిపాదనల రూపంలో సిఫార్సు చేయాలని అధికారులకు సూచించారు. గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశభక్తిని చాటేలా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యా శాఖ అధికారికి సూచించారు. ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలని డీఎంహెచ్ఓను ఆదేశించారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రోటోకాల్‌ను పాటిస్తూ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ మ్మనారాయణ, అడిషనల్ ఎస్పీ శంకర్ నాయక్, ఆర్డీవో అలివేలు, కలెక్టరేట్ ఏ ఓ భూపాల్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.



గణతంత్ర వేడుకలపై సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

## ఊట్కూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించాలని కలెక్టర్‌కు వినతి

**నారాయణపేట, జనవరి 19 ప్రభాతవార్త :** నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా ఊట్కూర్ పెద్ద చెరువును రిజర్వాయర్ గా మారుస్తున్న నేపథ్యంలో, ఊట్కూర్ మండల కేంద్రాన్ని ముంపు గ్రామంగా ప్రకటించాలని కోరుతూ ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు స్థానికులు వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉన్న పెద్ద చెరువు నీటి సామర్థ్యాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామ పరిసరాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టినట్లు, పునాదులు తవ్వగానే నీటి ఊట వస్తోందని వారు తెలిపారు. ఈ చెరువును రిజర్వాయర్‌గా మారిస్తే భవిష్యత్తులో గ్రామానికి తీవ్రమైన ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం రైతులకు సాగునీరు అందించేందుకు చేపట్టిన ఎత్తిపోతల పథకం ద్వారా పొలాలకు నీరు అందుతున్నప్పటికీ అదే సమయంలో గ్రామ ప్రజలకు ముంపు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. రిజర్వాయర్ పనులు ప్రారంభించే ముందు ఊట్కూర్‌ను ముంపు గ్రామంగా ప్రకటించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఇరిగేషన్ శాఖ అధికారులతో చర్చించి ఊట్కూర్‌లో రిజర్వాయర్ ఏర్పడితే కలిగే నష్టాలపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి నివేదిక తీసుకుని తగిన న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అదే సమయంలో మండల కేంద్రంలో వీధి కుక్కల దాడులు విపరీతంగా పెరిగిపోయాయని, చిన్న పిల్లలు, పశువులపై దాడులు జరుగుతున్నాయని కలెక్టర్‌కు తెలిపారు. పలుమార్లు చిన్నారులు తీవ్రంగా గాయపడినట్లు, చెట్లపై నివసించే కోతిని కూడా కుక్కలు దాడి చేసి చంపినట్లు తెలిపారు. పెంపుడు జంతువులు, పాడి పశువులు, కుక్కల దాడికి మృతి చెందుతున్నాయని పేర్కొన్నారు. అర్ధరాత్రి వేళ వీధి కుక్కల అరుపుల వల్ల ప్రజలు నిద్రలేని రాత్రులు గడుపుతున్నారని వాపోయారు. ఈ సమస్యపై ఇప్పటికే స్థానిక, పంచాయతీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని వీధి కుక్కల నియంత్రణకు తక్షణమే చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీవైఎం జిల్లా అధ్యక్షులు భరత్,ఉప సర్పంచ్ రమేష్, నరేష్, అనిల్, రవి, మల్లేష్‌తో పాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.



ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్‌కు స్థానికులు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## ధన్వాడ పోలీస్ స్టేషన్‌లో వార్త-2026 క్యాలెండర్ ఆవిష్కరణ

**జర్నలిస్టులు ప్రజల మాట వింటూ - ప్రజల సమస్యలు వెలుగులోకి తెస్తారు :ఎస్ఐ రాజశేఖర్**

**ధన్వాడ జనవరి 19 ప్రభాతవార్త :** ధన్వాడ మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో వార్త-2026 క్యాలెండర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ఈకార్యక్రమానికి ఎస్సై రాజశేఖర్, బీఎస్పీ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొదిగల శ్రీనివాస్, మత్స్య పరిశ్రమిక సహకార సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నర్సిములు నాయుడు ముదిరాజ్, ధన్వాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు/సీనియర్ జర్నలిస్ట్ శంకరయ్య ప్రధాన అతిథులుగా హాజరయ్యారు. క్యాలెండర్ ఆవిష్కరణ అనంతరం ఎస్ఐ రాజశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టులు ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నా కూడా ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు బయట ప్రపంచానికి చేరుస్తారు. ఎక్కడ సమస్య ఉంటే అక్కడికి ముందుగా చేరేది మీడియా. రాత్రింబవళ్లు పని చేస్తూ ప్రజలకు నిజమైన సమాచారాన్ని అందించడంలో జర్నలిస్టుల పాత్ర అపారమైనది" అని వెల్లడించారు. అలాగే జనసేవలో ఉన్న మీడియా ప్రతినిధులు తమ ప్రాణాలకైనా ప్రమాదం వాటిల్లినా తగ్గకుండా విధుల్లో ఉండటం గొప్ప విషయమని అభినందించారు. సమాజం ముందు సమస్యల్ని అద్దం పట్టే వర్గం జర్నలిస్టులేనని, వారితో పోలీస్ శాఖకు ఎప్పటిలాగే మంచి సహకారం కొనసాగుతుందన్నారు.ఈకార్యక్రమంలో బీఎస్పీ జిల్లాఅధ్యక్షుడు బొదిగల శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కూడా వార్తలను వేగంగా వెలుగులోకి తెచ్చేది జర్నలిస్టులే. ప్రజా సమస్యలపై ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడంలో మీడియా కీలకం" అన్నారు. జిల్లా ఉపాధ్యక్షులు నర్సిములు నాయుడు మాట్లాడుతూ మీడియా ఉండటం వల్లే ప్రతి చిన్న పెద్ద సమస్య వెలుగు చూస్తుంది. జర్నలిస్టులు ఎదుర్కొనే కష్టాలు అనేకం. అయినా వారు సేవ చేస్తారు" అని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక వార్తా విలేకరులు డి.బాల్‌రాజ్, సహదేవ్ తో పాటు జర్నలిస్టులు, పోలీస్ సిబ్బంది, అఖిలపక్ష నాయకులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎస్సై రాజశేఖర్

## గ్రామ సంస్కృతి ప్రాచీన చరిత్రపై కార్యక్రమం

**ఉప్పునుంతల, జనవరి 19 ప్రభాతవార్త :** ఉన్నత అధికారుల సూచనల మేరకు మై విలేజ్ మై కల్చర్ కార్యక్రమంలో భాగంగా ఉప్పునుంతల గ్రామంలో సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు ,ఉపసర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్ గ్రామ పెద్దలు, గ్రామస్థులతో కలిసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ చరిత్ర, సంస్కృతి, వారసత్వానికి సంబంధించిన ప్రాథమిక అంశాలపై విస్తృతంగా చర్చించారు. గ్రామానికి ఉప్పునుంతల అనే పేరు ఎలా వచ్చింది, గ్రామ పంచాయతీ ఏర్పాటు వివరాలు, కోట బురుజుల ప్రాముఖ్యత, శివాలయ చరిత్ర, ప్రముఖ వ్యక్తుల సేవలు, గ్రామంలోని చెరువులు-కుంటల విశేషాలు, తొలి దశ ఉద్యమం నేపథ్యం, రాజపుత్రుల వలస ద్వారా రంగంపేటకు వచ్చిన గ్రామస్థుల చరిత్ర వంటి అంశాలను సేకరించి నమోదు చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీలోని ప్రత్యేకమైన అంశాలను జనవరి 26 నుంచి ఫిబ్రవరి 2 వరకు ఆన్లైన్‌లో నమోదు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామానికి సంబంధించిన ప్రత్యేక వ్యక్తులు, కళలు, కళాకారులు, స్వాతంత్ర్య సమరయోధులు, మలిదశ ఉద్యమ కారుల వివరాలు ఎవరైనా కలిగి ఉంటే జనవరి 26లోపు గ్రామ పంచాయతీ కార్యాలయానికి అందించాలని గ్రామస్థులను కోరారు. ఈ సమావేశంలో సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కట్ట అనంతరెడ్డి, అంతటి శేఖర్ గౌడ్ యువతతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొని తమ అభిప్రాయాలు, సూచనలు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసి గ్రామ సంస్కృతి, వారసత్వాన్ని భవిష్యత్ తరాలకు పరిచయం చేయాలని వారు కోరారు.



మన గ్రామపంచాయతీ

సంస్కృతిపై చర్చిస్తున్న సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు

## రోడ్డు భద్రత నియమాలను

## ఖచ్చితంగా పాటించాలి : ఎస్ఐ



ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎస్సై హిమబిందు

**శ్రీరంగాపూర్,జనవరి 19 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలంలోని కంబలపురం గ్రామంలో సోమవారం రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందు వారి సిబ్బందితో కలిసి రోడ్డు భద్రత నియమాలను ఖచ్చితంగా పాటించాలని, వాహనదారులకు అవగాహన కల్పిస్తూ వారితో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. మద్యం సేవించి వాహనాలను నడపరాదని, హెల్మెట్ కచ్చితంగా ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని, వాహనాలను నడుపుతున్నప్పుడు సెల్‌ఫోను లో మాట్లాడరాదని వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగాపూర్ ఎస్సై హిమబిందుతో పాటు ఏఎస్ఐ మన్యపు రెడ్డి, వారి సిబ్బంది పాల్గొన్నారు.

## భారీ వాహనాల ద్వారా

## ఇసుక రవాణాను అరికట్టాలి

**తహసిల్దార్‌కు విన్నవించుకున్న గ్రామ సర్పంచ్**





తహసీల్దార్ కు వినతిపత్రం అందజేసిన సర్పంచ్

**ఉప్పునుంతల, జనవరి 19 ప్రభాతవార్త :** తమ గ్రామం పరిసర ప్రాంతంలో ఉన్న దుందుభి వాగు నుంచి ఇసుక అక్రమ రవాణాను భారీ వాహనాల నుంచి అరికట్టాలని దాసర్లపల్లి గ్రామ సర్పంచ్ రమేష్ రెడ్డి, ఉప సర్పంచ్ పానుగంటి శంకర్‌లు స్థానిక తహసిల్దార్ అద్దంకి సునీతకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రంలో గ్రామం నుంచి భారీ వాహనాల ద్వారా ఇతర ప్రాంతాలకు ఇసుక రవాణా జరగడం వల్ల రహదారులు పూర్తిగా దెబ్బతింటున్నాయని, వాహనాల రాకపోకలతో రైతులు, గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అనుమతులు లేకుండా , అభివృద్ధి పనుల పేరిట దుందుభి వాగు నుంచి సుదూర ప్రాంతాలకు లారీ ద్వారా కాకుండా ట్రాక్టర్ ద్వారా తరలింపు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. భారీ వాహనాల అనుమతులను రద్దు చేసి, స్థానిక అవసరాల కోసం మాత్రమే గ్రామంలోని ట్రాక్టర్ యజమానులకు అనుమతులు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజల భద్రత దృష్ట్యా టిప్పర్ల ద్వారా ఇసుక రవాణాను పూర్తిగా నివారించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై స్పందించిన తహసిల్దార్ అద్దంకి సునీత తక్షణమే గ్రామాన్ని సందర్శించి పూర్తి నివేదిక సమర్పించాలని రెవెన్యూ ఇన్స్పెక్టర్ రామకృష్ణ, జిపిఓ రాము, పంచాయతీ అధికారులను ఆదేశించారు. అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఈసందర్భంగా ఆమె హామీ ఇచ్చారు.

## వ్యాయామంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి**



నూతన జిమ్ సెంటర్‌ను ప్రారంభించి వ్యాయామం చేస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

**చిన్న చింతకుంట, జనవరి 19 ప్రభాతవార్త :** ప్రతినిత్యం వ్యాయామం చేయడంవల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా జీవిస్తారని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఫిట్నెస్ జిమ్ సెంటర్ ను స్థానిక సర్పంచ్ మానస దశరథ్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉరుకుల పరుగుల జీవితంలో వ్యాయామం లేకుండా అలసిపోతున్నారన్నారు. ప్రస్తుతం ఆధునిక పరికరాలతో వ్యాయామం చేయడం వల్ల శరీర దారుఢ్యం పెరిగి ఫిట్నెస్ గా ఉంటారని ఆయన తెలిపారు. మండల కేంద్రంలో ఫిట్నెస్ జిమ్ సెంటర్‌ను ఏర్పాటు చేసిన ఇద్రిస్ ను అభినందించారు. అల్లిపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు నరేందర్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ కథలప్ప, విండో చైర్మన్ సురేందర్ రెడ్డి, నాయకులు వెంకటేష్, వట్టెం శివకుమార్, అమ్మాపూర్, మద్దూర్, పరిదీపూర్, వడ్డేమాన్ సర్పంచులు రంజిత్, దామోదర్ యాదవ్, శివకుమార్, ఈశ్వర్ సింగ్, తోపాటు స్థానిక ఉప సర్పంచ్ భూలక్ష్మి ్మ చంద్రశేఖర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలి

**దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇంచార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి**



మాట్లాడుతున్న కొండా ప్రశాంత్ రెడ్డి

**దేవరకద్ర,జనవరి 19 ప్రభాతవార్త:** ప్రధానమంత్రిగా నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయాలని దేవరకద్ర నియోజకవర్గ బిజెపి ఇంఛార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి అన్నారు. దేవరకద్ర నియోజకవర్గ దేవరకద్ర పట్టణ కేంద్రంలో వచ్చే నెలలో జరగనున్న దేవరకద్ర మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా దేవరకద్ర మండల ముఖ్య నాయకుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ కొండా ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ గత స్థానిక సంస్థల ఎన్నికలలో కొండ విజయలక్ష్మి ్మ సర్పంచ్ గా గెలిచి, దేవరకద్ర పట్టణానికి చేసిన అభివృద్ధిని, కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, ప్రజల దృష్టికి తీసుకెళ్లి వారిని లబ్ధిదారులుగా చేయాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మండల అధ్యక్షులు కృష్ణంరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణరెడ్డి, ఓబిసి కార్యవర్గ సభ్యులు దేవన్నసాగర్, శేఖర్, దేవరకద్ర మున్సిపాలిటీ ఎన్నికల ఇంఛార్జ్ కొండా వెంకటేశ్వర్ రెడ్డి, కొండ నాగిరెడ్డి, రాసాల రాజు, స్టేషన్ సత్యనారాయణ, బాలరాజు, ప్రభు, శ్రీనివాసరెడ్డి, హోటల్ ఆంజనేయులు, రాంబాబు, యూత్ అధ్యక్షులు రాజు, ముఖ్య వార్డుల నాయకులు, ముఖ్య కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అమోఘంగా అంబులెన్స్ సేవలు

**ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ కె. రవి**

**చిన్నంబావి,జనవరి 19 ప్రభాతవార్త :**ఉమ్మడి జిల్లాస్థాయిలో వివిధ మండల కేంద్రంలోని 108, 102 అంబులెన్స్‌లు సక్రమంగా పనిచేస్తున్నాయని, ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తూ మంచి గుర్తింపును తీసుకొచ్చాయని ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రవికుమార్ అన్నారు. సోమవారం చిన్నంబాయి మండల కేంద్రంలోని అంబులెన్స్ సేవలపై ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంబులెన్స్ లోని వివిధ రకాల పరికరాల పనితీరు మరియు మందులను పరిశీలించడం జరిగింది.అనంతరం ఆయన మాట్లాడుతూ 108 అంబులెన్సుల ద్వారా ప్రజలకు అత్యుత్తమ సేవలను అందిస్తున్నామని ప్రమాద బాధితులను, ఆపదలో ఉన్న వారిని వెంటనే దగ్గర్లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్నామని ప్రజలు ఆయా మండలాల్లో అంబులెన్స్ వాహనాల ద్వారా వైద్య సేవలను ఉపయోగించుకోవాలని కోరారు పేర్కొన్నారు. అలాగే 102 అమ్మఒడి అంబులెన్సులు గర్భిణీ స్త్రీలు పరీక్షలు నిమిత్తం వాడుకోవాలని అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో డెలివరీ అయిన తర్వాత తల్లి బిడ్డలను ఇంటిదగ్గరకి తీసుకెళ్లడానికి, ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాక్సినేషన్ కోసం అమ్మఒడి వాహనాలను వాడుకోవాలని ఆయన అన్నారు.ప్రజలందరూ ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెహబూబ్ , ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్ శ్రీధర్, పైలెట్ రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## నూతన కమిటీ ఎన్నిక

**దేవరకద్ర,జనవరి 19 ప్రభాతవార్త:** బిజీ హెచ్‌పిఎస్ నియోజకవర్గ సిరివాటి జంగం రవి ఆదేశాల మేరకు నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కౌకుంట్ల మండలం వెంకటగిరి గ్రామం బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి, గ్రామ శాఖ నూతన కమిటీ సోమవారం ఎన్నుకున్నారు, బిజిహెచ్ పిఎస్ గ్రామ అధ్యక్షులుగా ఇప్పమన్యం, గౌరవ అధ్యక్షుడు నిడగొండ పెంటన్న ,ఉపాధ్యక్షులుగా సిరిగిరి గోపాల్, ప్రధాన కార్యదర్శి నిడగొండ బుచ్చన్న, కోశాధికారి ఇప్ప వెంకటేష్, కార్యదర్శి ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దేవరకద్ర నియోజకవర్గం అధ్యక్షులు సిరివాటి జంగం రవి హాజరు కాగా కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు సిరిగిరి శీను, సిరిగిరి వెంకటేష్, గ్రామ సర్పంచ్ పొన్నకంటి లక్ష్మయ్య, సీసీ కుంట అధ్యక్షుడు గగనం శంకర్, సిరిగిరి వెంకటేష్, సిరిగిరి గోపాల్, చిత్తరి శంకర్, గణేష్, ఎల్ల స్వామి, సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా నియామాలు పాటించాలి :ఎస్సై

**లింగాల, జనవరి 18 ప్రభాతవార్త:** రోడ్డుపై వెళ్తున్న ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియామాలు పాటించాలని ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ అన్నారు. సోమవారం లింగాల మండల కేంద్రంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా మాగ్దూంపూర్ చౌరస్తాలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీటుబెల్ట్ వినియోగించాలని సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అధిక వేగంతో డ్రైవింగ్ చేయడం వల్ల ప్రమాదాలు సంభవిస్తాయని సూచించారు.వాహనాలు నడుపుతున్న సమయంలో మొబైల్ ఫోన్ వినియోగించరాదని, మైనర్స్ వాహనాలు ఇవ్వరాదని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించిన వారికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాగ్దూంపూర్ సర్పంచ్, ఉపసర్పంచ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ సత్తా చాటాలి

**మక్తల్ మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి**



కాంగ్రెస్ పార్టీ నుండి బిఆర్ఎస్‌లో చేరుతున్న నాయకులకు కండువా కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

**ఆత్మకూర్ జనవరి 19, ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో మొత్తం నియోజకవర్గంలో అధికార పార్టీ నాయకులను ఎక్కడికక్కడ నిలదీయాలని టిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించి ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని మక్తల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు చిట్టెం రామ్మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని మండల పార్టీ అధ్యక్షులు రవికుమార్ యాదవ్ స్వగృహంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల సన్నాక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజా సమస్యలను గాలికి వదిలేసిందని అందులో భాగంగానే ఎన్నికల సమయంలో మాత్రమే మహిళలకు చీరల పంపిణీ గుర్తుకు వచ్చిన విషయాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వంగా చెప్పుకుంటూనే గత ఎన్నికల సమయంలో ఇచ్చిన వాగ్దానాలను పూర్తిగా గాలికి వదిలేసిందని ఇప్పటివరకు రైతుబంధు మరియు పెన్షన్ల పంపిణీ చేపట్టకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు.గత నెలలో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో ఇప్పటికే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో సైతం మరో మారు ప్రజావ్యతిరేకతను ఓటు ద్వారా ప్రజలు కాంగ్రెస్ పార్టీకి తగిన విధంగా బుద్ధి చెప్పాలని ఆయన విజ్ఞప్తి చేశారు. అనంతరం పట్టణంలోని మున్సిపల్ వార్డులకు సంబంధించి అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరించారు. పట్టణానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు జయరాం నాయక ఆధ్వర్యంలో చిట్టెం రామ్మోహన్ రెడ్డి సమక్షంలో టిఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు జానకిరాములు, సోంబాబు, దండు శ్రీనివాసులు, కొత్తబోయే శేఖర్, అజపాగ మాసన్న తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి వాకిటి శ్రీహరి



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి



మహిళా సంఘాలకు చెక్కులను పంపిణీ చేస్తున్న రాష్ట్ర మంత్రి

**ఆత్మకూర్ జనవరి 19, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం కొనసాగినంత కాలం మహిళా సాధికారత కోసం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖామంత్రి మక్తల్ నియోజకవర్గం శాసనసభ్యులు వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు చెక్కుల పంపిణీతోపాటుగా ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలకొల్లు నిర్లక్ష్యం మూలంగా మహిళా సంఘాలు పూర్తిగా నిర్వీరియమైపోయిన విషయాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తించి రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలను తక్షణమే అందజేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకున్నామని అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల చెక్కులను పంపిణీ చేస్తున్నట్లుగా ఆయన తెలిపారు. అంతేకాకుండా మహిళలకు ఆర్థిక చేయూతనందించే దుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపట్టిన విషయాన్ని గుర్తు చేస్తూ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు రాష్ట్రంలో మహిళా అభివృద్ధి కోసం ప్రత్యేక పెట్రోల్ బంకులు, వడ్ల కొనుగోలు కేంద్రాలను మహిళా సంఘాలకు కేటాయించడం మూలంగా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్న విషయాన్ని గుర్తించి ప్రజా ప్రభుత్వానికి చేయూతనందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో గత నెలలో జరిగిన పంచాయతీ ఎన్నికల ఫలితాలను రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టి అభివృద్ధికి తోడ్పాటున అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. మక్తల్ నియోజకవర్గం ఇప్పటికే ఒక వెయ్యి 35 కోట్ల నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయని మరో రెండున్నర సంవత్సరాల కాలంలో అదనంగా 1000 కోట్ల నిధులు వెచ్చించి ప్రతి గ్రామానికి మంచినీరు మరియు సిసి రోడ్ల నిర్మాణాలతో పాటుగా మురుగు కాలువల నిర్మాణాలను పూర్తి చేసి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం పట్టణంలోని అంద విద్యార్థులు క్రీడల్లో రాణిస్తున్న విషయాన్ని గుర్తించి అంద క్రీడాకారులను శాలువాలు మరియు మెమెంటోళ్ళతో రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ప్రత్యేకంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా మక్తల్ నియోజకవర్గం యువజన కాంగ్రెస్ నాయకులు తులసిరాజు యాదవ్ ఆత్మకూరు మండల పార్టీ అధ్యక్షులు పరమేష్ ఆత్మకూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నల్గొండ శ్రీనివాసులు కాంగ్రెస్ నాయకులు దామోదర్ మహేష్, గాలి పంపు శ్రీనివాసులు, గణేష్, తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలి

**జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి.. సీఎం కప్ క్రీడలకు సన్నద్ధం కావాలి.. ప్రజావాణికి 51 ఫిర్యాదులు**



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్, జనవరి 19 ప్రభాతవార్త:** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లాకలెక్టర్ విజయేందిరబోయి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ మీటింగ్ హాల్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 51 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌తో పాటు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన చేస్తూ పరిష్కరించాలని వారు సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు.అనంతరం జిల్లాకలెక్టర్ జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో మాట్లాడుతూ సిఎం కప్ క్రీడా పోటీలను షెడ్యూల్ ప్రకారం గ్రామ,మండల/ మున్సిపాలిటీ,నియోజకవర్గ,జిల్లా స్థాయిలో నిర్వహించేందుకు ఎంపిడిఓలు, ఎంపిఓలు,పంచాయతీ కార్యదర్శులు, ఎంఈఓలు,హెడ్ మాస్టర్లు సమన్వయంతో తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఈనెల 17నుండి 22వరకు గ్రామ స్థాయిలో, తరువాత 28 నుండి 31 వరకు మండల/మున్సిపల్ స్థాయిలో, ఫిబ్రవరి3 నుండి 5వరకు నియోజకవర్గంలో, ఫిబ్రవరి9 నుండి 12జిల్లా స్థాయిలో నిర్వహించాలని సూచించారు.

గురుకుల పాఠశాలలు,వసతి గృహాలు జిల్లా అధికారులు తమకు కేటాయించిన వాటిని తనిఖీలు పూర్తి చేసి విద్యా ఐఅప్ లో నమోదు చేయాలని సూచించారు. సమావేశంలో డిఆర్‌డిఓ నర్సింహులు,ఆర్‌డిఓ నవీన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ప్రభుత్వం

**లబ్దిదారులకు ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేసిన ఎమ్మెల్యే బండ్ల**



ఇళ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణ మోహన్ రెడ్డి

**గద్వాల జనవరి 19, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి అన్నారు. సోమవారం గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గద్వాల టౌన్ సంబంధించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు అయిన అర్హులకు ఎమ్మెల్యే ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ....గద్వాల నియోజకవర్గ ప్రజల అభివృద్ధి కొరకు నిరంతర కృషి చేయడం జరిగిందనీ, అందులో భాగంగానే అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలను అందజేస్తున్నామని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వాలు వచ్చిన మన నియోజకవర్గ అభివృద్ధికి కావలసిన పనులను తెచ్చుకోవడం జరుగుతుందన్నారు.గద్వాల పట్టణ అభివృద్ధి కోసం ప్రతి వార్డ్ లో సిసి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను నిర్మాణం చేయడం జరిగిందనీ,అదే విధంగా పార్కులు, సెంట్రల్ లైటింగ్ , ప్రతి వార్డ్ లో లైటింగ్ ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. అదే విధంగా గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించే విధంగా వైద్య పరికరాలు ఏర్పాటు చేశామన్నారు. నర్సింగ్ కాలేజ్, మెడికల్ కాలేజీ, తీసుకురావడం జరిగిందనీ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం లో సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రకారం ఆరు గ్యారెంటీలో భాగంగా ఇప్పటికే రెండు గ్యారెంటీ లను పూర్తి చేయడం జరిగిందనీ, మహిళా ఫ్రీ, 500 రూపాయల సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల, 200 యూనిట్ల ఉచిత కరెంటు, రైతులకు రైతు రుణమాఫీ, రైతు బంధు, రేషన్ కార్డులు, సన్న బియ్యం, అందించడం జరుగుతుందన్నారు. గద్వాల నియోజకవర్గ లో మొదటి విడతగా 3500 ఇండ్లు మంజూరు కావడం జరిగిందనీ, ఇందులో గద్వాల టౌన్ ఇండ్లను 515 పైగా కేటాయించడంతో ఇల్లు లేని పేద ప్రజలకు ప్రతి ఒక్కరూ కచ్చితంగా ఇంటి నిర్మాణం చేసుకోవాలనీ, ఎవరికీ మధ్యవర్తిత్వం లేకుండా ప్రభుత్వము నుంచి వచ్చే డబ్బులను వారి ఖాతా లోని జమ కావడం జరుగుతుందన్నారు . సొంతింటి కల నెరవేర్చు కోడానికి ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవడానికి ప్రభుత్వము కృషి చేయడం జరుగుతుందన్నారు. భవిష్యత్తులో గద్వాల టౌన్ మరింత అభివృద్ధి చెందాలంటే త్వరలో జరగబోయే మున్సిపాలిటీ ఎన్నికలలో మేము బలపరిచిన అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్ గౌడు, జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, మాజీ జిల్లా రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు చెన్నయ్య, దేవాలయ చైర్మన్ వెంకట్రాములు, మాజీ చైర్మన్ సతీష్, వ్యవసాయ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బాబర్, మాజీ కౌన్సిలర్స్, మున్సిపల్ కమీషనర్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ నిధులతో గద్వాల రైల్వే స్టేషన్ అభివృద్ధి

**అమృత్ భారత్ స్టేషన్ ఎంపికలో గద్వాల రైల్వే స్టేషన్**

**బీజేపీ అధ్యక్షుడు రామాంజనేయులు**



రైల్వే స్టేషన్ పరిశీలించిన అనంతరం మాట్లాడుతున్న అధ్యక్షుడు రామాంజనేయులు

**గద్వాల, జనవరి 19, ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం నిధులతో గద్వాల రైల్వే స్టేషన్ అభివృద్ధి జరుగుతుందని, అమృత్ భారత్ స్టేషన్ల ఎంపికలో భాగంగా గద్వాల రైల్వే స్టేషన్ దేశంలో పేరుగాంచిన అభివృద్ధి స్టేషన్ గా అవతరించబోతుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. మహబూబ్నగర్ పార్లమెంటు సభ్యురాలు డికె. అరుణమ్మ సహకారంతో గద్వాల రైల్వే స్టేషన్ అభివృద్ధి చెందుతుందని, సోమవారం గద్వాల రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను బిజెపి జిల్లా అధ్యక్షులు రామాంజనేయులుతో పాటు గద్వాల బిజెపి నాయకులు కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. గద్వాల రైల్వే స్టేషన్ అభివృద్ధిలో మహబూబ్ నగర్ ఎంపీ డికె. అరుణమ్మ పాత్ర కీలక పాత్ర పోషించారని, ముఖ్యంగా కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి పెండింగ్ పనులకు ,ప్రాజెక్టులకు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. అమృత్ భారత్ పథకం కింద స్టేషన్ ఆధునికరణకు, స్థానిక ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరడం జరిగిందన్నారు.ఈ ప్రాజెక్టు ద్వారా స్టేషన్ రూపు రేఖలు మారుతాయి అని ఇది గద్వాల జిల్లాకు ముఖ్యమైన రవాణా కేంద్రం గా మారనుందని అన్నారు.దాదాపుగా 15 కోట్ల పైగా గద్వాల రైల్వే స్టేషన్ కు నిధులు రావడంతో ఆధునిక సౌకర్యాలు మెరుగైన ట్రాఫిక్ నిర్వహణ, ప్లాట్ ఫారం, ఎస్కులేటర్లు, లిఫ్టులు ,అధునాతన టాయిలెట్స్, పార్కింగ్ సౌకర్యం, గార్డెనింగ్, వెయిటింగ్ హాల్లు, ప్రాంతీయ నిర్మాణ నమూనాలతో స్టేషన్ ఆధునికరణంగా మారనుందన్నారు. గద్వాల రైల్వేటేషన్ అతి పురాణతాం ైమైనదనీ, రాయచూర్ రైల్వే లైన్ ప్రారంభం కావడంతో ఇది జంక్షన్ గా మారిందనీ, గద్వాల మాచర్ల కొత్త లైన్ స్టేషన్ లు కనెక్ట్ జంక్షన్ గా మారే అవకాశం ఉందని, ప్రస్తుతం గద్వాల రైల్వే స్టేషన్ లో దాదాపుగా 50 పైగా రైళ్ల రాకపోకలు సాగిస్తున్నడంతో , అభివృద్ధి పరంగా గద్వాల చేనేత చీరలు ,విద్య ,ఆరోగ్యం, వ్యాపారం,పర్యాటక కేంద్రం అన్ని విధాలుగా దోహదపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్లు బండల వెంకట రాములు, అక్కల రమాదేవి,జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్బోటే, జిల్లా మహిళ మోర్చా అధ్యక్షురాలు సమత గౌడ్, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు దాస్, పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ,జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు డబ్బిలేటి నరసింహ,రాష్ట్ర బిజెవైఎంకార్యవర్గ సభ్యుడు ఢిల్లీవాలా కృష్ణ, మండల అధ్యక్షుడు శ్రీను,బిజెపి సీనియర్ నాయకులు రజక నరసింహ ,మోహన్ రెడ్డి, గంజి పేట తిమ్మన్న,మార్కెట్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ



ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**మద్దూర్, జనవరి 19 ప్రభాతవార్త :** ఇందిర మహిళా సంబరాలు కార్యక్రమాన్ని పురస్కరించుకుని మద్దూర్ పురపాలక సంఘం ఆధ్వర్యంలో సోమవారం పురపాలక సంఘ ఆవరణలో ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ సి. శ్రీకాంత్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ పిఎసిఎస్ చైర్మన్ గూళ్ళ నర్సింహులు మాట్లాడుతూ మహిళల ఆర్థిక–సామాజిక సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు స్వావలంబన దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మద్దూర్ పట్టణ పరిధిలోని 2803 మందికి సెల్ఫ్ హెల్ప్‌గ్రూప్‌లకు చెందిన మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది బీములు, రఘుపతి రెడ్డి, కూనే సంజీవులు, రహీం, రేణివట్ల గోవింద్, జనార్ధన్, జంగం బాబు, గణప చందు, పురుషోత్తం, ఉషన్ మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధి నా ధ్యేయం



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మెగావత్ శ్రీనునాయక్

**వెల్దండ, జనవరి 18 ప్రభాతవార్త:** గ్రామాన్ని అని రంగాలలో అభివృద్ధి పర్చడమే తన ధ్యేయమని సర్పంచ్ శ్రీను నాయక్ అన్నారు. మండల పరిధిలోని కేస్లీ తండాలో గ్రామ సర్పంచ్ మెగావత్ శ్రీనునాయక్ అధ్యక్షతన సోమవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో ప్రజలు గ్రామపంచాయతీ భవనం అండర్ డ్రైనేజ్ ఏర్పాటు సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని సర్పంచ్ దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి విడతల వారీగా గ్రామ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని సర్పంచ్ శ్రీనునాయక్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి విష్ణు, ఉప సర్పంచ్ ఉమా లక్ష్మణ్ నాయక్, వార్డు సభ్యులు అమర్ సింగ్, శాంతి భీమ్లా, బిచ్చాని, శ్వేత, సంతోష, లక్ష్మి, గ్రామస్తులు గోపాల్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

## చికిత్స పొందుతున్న వృద్ధురాలికి ఆర్థిక సహాయం

**వెల్దండ, జనవరి 18 ప్రభాతవార్త:**మండలంలోని పోతేపల్లి గ్రామానికి చెందిన బోయిని నారమ్మ అనారోగ్యానికి గురై మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ యాదవ్ నారమ్మను పరామర్శించి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. ఆయన వెంట జియాగూడ యాదవ సంఘం అధ్యక్షులు జక్కుల చిన్న జంగయ్యయాదవ్, అలీ, నిజాం, మల్లేష్, తదితరులు ఉన్నారు.

## ఆపదలో ఉన్నవారికి కొండంత అండ సీఎం సహాయనిధి

**బాధిత కుటుంబానికి రూ.3 లక్షల ఎల్ఓసిని అందజేసిన ఎమ్మెల్యే**



మూడు లక్షల ఎల్ఓసిని అందజేసిన దేవరకద్ర ఎమ్మెల్యే

**దేవరకద్ర,జనవరి 19 ప్రభాతవార్త:** ఆపదలో ఉన్నవారికి కొండంత అండగా ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అన్నారు. దేవరకద్ర పట్టణానికి చెందిన బోయ శివశంకర్ అనారోగ్యంతో గుండె సంబంధిత చికిత్స పొందుతున్నారు. అతని వైద్యం నిమిత్తం హైదరాబాద్‌లో నిమ్స్ ఆసుపత్రికి సీఎం సహాయనిధి ద్వారా రూ.3లక్షల ఎల్ఓసిని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ముఖ్యమంత్రి సహాయనిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపాలిటీ కాంగ్రెస్ నాయకులు శేఖర్ రెడ్డి, రామాంజనేయులు, తదితరులు ఉన్నారు.

